దవాఖానలో రక్త నిల్వలు పెంచుకోవాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

శిబిరంలో సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, జూన్ 14 : జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి జిల్లా దవాఖానలో రక్త నిల్వలను పెంచుకోవాలని, ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌ను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని జిల్లాలో రక్త నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, రక్తదానం చేయడం ద్వారా మరొకరికి మేలు చేసి ప్రాణదానం చేసిన వారమవుతామన్నారు. దవాఖానలో రక్త నిల్వలు పెంచుకొని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా 40 సార్లు రక్తదానం చేసిన శ్రీనివాసులును కలెక్టర్ సన్మానించారు. రక్తదానం చేసిన వారందరినీ ప్రశంసిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. ఈశిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సుధాకర్‌లాల్, సాయిబాబు, సురేశ్‌బాబు, నాగరాజు, రమేశ్ రెడ్డి, రోహిత్ పాల్గొన్నారు.

సర్జికల్ క్యాంప్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే

అచ్చంపేట/ఉప్పునుంతల, జూన్ 14 : పట్టణంలోని ఏరియా దవాఖానలో శుక్రవారం నిర్వహించిన సర్జికల్ క్యాంపులో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని ఆపరేషన్ చేశారు. ట్యూబెక్టమి, కడుపులో ఉన్న కణతిని ఆపరేషన్ చేసి తొలగించారు. క్యాంప్‌లో పేర్లు నమోదు చేసుకున్న అందరికీ ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. నేడు ఉప్పునుంతల పీ హెచ్‌సీలో వంగూరు, చారకొండ మండలాలకు చెందిన వారికి, 19న లింగా ల పీహెచ్‌సీలో బల్మూర్ మండలానికి చెందిన వారి కి, 23న అమ్రాబాద్ పీహెచ్‌సీలో పదర, అమ్రాబాద్ మండలాలకు చెందిన వారికి, 26న అచ్చంపేట ఏరియా దవాఖానలో అచ్చంపేట మున్సిపల్, సిద్ధాపూర్‌కు చెందిన వారికి ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. కేవలం ట్యూబెక్టమి ఆపరేషన్లు మాత్రమే చేస్తామని వారు పేర్కొన్నారు. ఉప్పునుంతలలోని సీహెచ్‌సీలో శనివారం సర్జికల్ మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఉప్పునుంతలలోని సీహెచ్‌సీని సందర్శించారు.

హరితహారం మొక్కలెక్కడ ?

పొలాన్ని రోడ్డు అంచు వరకు దున్నిన దృశ్యం

- రోడ్డు అంచు వరకు దున్నుతున్న రైతులు
- ఇరుకుగా మారుతున్న రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రావు

ఉప్పునుంతల, జూన్ 14 : అధికారుల నిర్లక్ష్యం వల్ల హరితహారం లక్ష్యం నీరుగారుతున్నది. రాష్ట్రంలో అటవీశాతాన్ని పెంచాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో ప్రభుత్వ స్థలాలు, ఇంటి పరిసరాలు, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఆయా ప్రదేశాల్లో నాటాల్సిన మొక్కల కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక నర్సరీలను సైతం ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మొక్కలను పెంచి ప్రతి ఏడాది నిర్దేశించిన ప్రాంతాల్లో నాటుతూ వస్తున్నారు. వాటి సంరక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగించడంతో ప్రతిరోజూ పర్యవేక్షించేవారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు హరితహారం కార్యక్రమం సజావుగా సాగింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక హరితహారం లక్ష్యం నీరుగారుతున్నది. రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలను రైతులు తొలగించి రోడ్డుకు ఆనుకొని పొలాలను చదును చేస్తున్నారు. దీంతో రహదారి కూడా చిన్నదిగా మారి వాహనదారులు రాకపోక లు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షు డు రవీందర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన రైతులు గెట్ల అంచున నాటిన మొక్కలను ధ్వంసం చేసి పొలాలను దున్నుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమని ఆయన పేర్కొన్నారు. గెట్ల అంచు వరకు పొలాలను దున్నుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా తొలగించిన మొక్కల స్థానంలో తిరిగి నాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇకపై హరితహారం మొక్కలను తొలగించే వారిపై కఠి న చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

లింగాల, జూన్ 14 : చెంచు యువకుడు బలన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని రాంపూర్ చెంచుపెంటకు చెందిన చిగుర్ల పెద్ద బయన్న, లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన రాముడు(18) ఈ నెల 11న తన తమ్ముడితో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. అడవిలోకి వెళ్లాక నీళ్లు తీసుకురమ్మని చెప్పడంతో అతడి తమ్ముడు అక్క డినుంచి ఇంటికొచ్చాడు. ఈక్రమంలో రాముడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

నీటి సంపులో పడి మహిళ మృతి

కోడేరు, జూన్ 14 : నీటి సంపులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కోడేరులో శుక్రవారం చోటు చేసుకున్నది. కోడేరు మండల కేంద్రం ఊరగుట్ట కాలనీకి చెందిన కళమ్మ(45) తన ఇంటి ముందు ఉన్న నీటిసంపులో గురువారం రాత్రి పడింది. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం ఇంటి పక్కల వాళ్లు చూడగా నీటి సంపులో పడి మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలికి భర్త తోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కుక్కల దాడిలో మూడు మేకలు మృతి

లింగాల, జూన్ 14 : వీధి కుక్కల దాడిలో మూడు మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని కోమటికుంటలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోమటికుంటకు చెందిన చంద్రకంటి శ్రీను తన పొలంలోని దొడ్డిలో గురువారం రాత్రి మేకల మందను ఉంచి ఇంటికొచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా వీధి కుక్కల దాడిలో మూడు మేకలు మృతి చెందాయని తెలిపారు. చనిపోయిన మేకల విలువ దాదాపు రూ.50వేలు ఉంటుందని బాధితుడు విలపించాడు. వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వాటిని అరికట్టేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

తిమ్మాజిపేట, జూన్ 14 : మండలంలోని ఆవంచ, అమ్మపల్లి గ్రామాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి కమల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల కంపెనీ వివరాలు, ఎక్కడి నుంచి వచ్చాయి, బ్యాచ్ నెంబర్ తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా రైతులకు ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి

బిజినేపల్లి, జూన్ 14 : మండలంలోని గంగారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం చేగువేరా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న క్రీడా పాఠశాలలకు ఎంపికలు

నాగర్‌కర్నూల్, జూన్ 14 : తెలంగాణలోని వివిధ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకోసం ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీజీ) ఆధ్వర్యంలో హకీంపేటలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8 నుంచి 9వ సంవత్సరాలు గల బాలబాలికల కోసం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ 2024 జూలై నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బాల బాలికలకు జిల్లాస్థాయి ఎంపికలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికలకు వచ్చేవారు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య కాలంలో జన్మించి ఉన్నవారు అర్హులని, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, కమ్యూనిటీ సర్టిఫికెట్, పది పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, 2 జతల జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకొని ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. ఎత్తు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, స్టాం డింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెంతో ఎం పికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలన్నారు.

ఉచిత విద్యపై సర్క్యులర్ జారీ చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 14 : జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను అందించడానికి సర్క్యులర్ జారీ చేయాలని టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తున్నా విధానాన్ని కొనసాగిస్తూ ఒక్కో జర్నలిస్టు కుటుంబంలోని ఇద్దరు పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రదీప్, ఐజేయూ జాతీయ నాయకులు సురేశ్, యూనియన్ నాయకులు రాజేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఉమాశంకర్, ఆహ్మదుల్లా ఖాన్, భాస్కర్, రాజు ఉన్నారు.

ఓపెన్‌స్కూల్, కళాశాల ఫలితాల్లో జిల్లాకు 13వ స్థానం

నాగర్‌కర్నూల్, జూన్ 14 : పదో తరగతి ఓపెన్ స్కూల్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లాకు 13వ స్థానం, ఇంటర్మీడియట్‌కు 16వ స్థానం దక్కింది. ఇంటర్మీడియట్ పరీక్షలకు 650 మంది అభ్యర్థులు హాజరు కాగా 365 మంది ఉత్తీర్ణత సాధించారు. 10వ తరగతి పరీక్షలకు 499 మంది హాజరు కాగా 276 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎవరైనా విద్యార్థులు రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోదలిస్తే ఇంటర్మీడియట్‌కి 400, పదో తరగతికి 350 చొప్పున మీసేవా ద్వారా చెల్లించాలని కోరారు. రీ వెరిఫికేషన్, ఫొటో కాపీ ఆఫ్‌ది ఆన్సర్ స్క్రిప్ట్ కావాల్సిన వారు మీసేవ ద్వారా రూ.1200 చెల్లించాలని పేర్కొన్నారు.

స్కూల్ బస్సు సీజ్ చేసిన డీటీవో

నాగర్‌కర్నూల్, జూన్ 14: సరైన పత్రాలు లేని నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును శుక్రవారం జిల్లా రోడ్డు రవాణా శాఖాధికారి బాలు నాయక్ సీజ్ చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా తిరుగుతున్న ఓప్రైవేట్ స్కూల్ బస్సును నిలిపి డ్రైవర్‌తో లైసెన్స్, ఇతర బస్సు పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనందున వాహనాన్ని సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రైవేట్ స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ కానీ, సరైన పత్రాలు కానీ లేకపోతే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులను పాఠశాలలకు చేరవేసే బస్సుల పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి

కల్వకుర్తి, జూన్ 14 : కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కుల గణన నిర్వహించాలనే డిమాండ్‌తో బీసీ జన సభ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించతలపెట్టింది. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ బీసీ నేతలు శుక్రవారం కల్వకుర్తిలో పోస్టర్ విడుదల చేశారు. బీహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకొని విధి విధానాల కోసం నిపుణులతో కూడిన కమిటీ వేయాలని ప్రభుత్వానికి సూచించారు.

ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చా రు. కార్యక్రమంలో జన సభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, విజయ్‌గౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు

మొక్కను నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కల్వకుర్తి, జూన్ 14 : మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు కార్యాలయ ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్యతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్వకుర్తిలో నూతన కోర్టు భవన నిర్మాణానికి హైకోర్టు రూ.24కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అంతకుముందు కల్వకుర్తికి వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబుకు కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రమణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రాజ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, వెంకటేశ్వర్‌రావు, జమీల్, భాస్కర్‌రెడ్డి, జగన్, రాంగోపాల్, జయంత్ కుమార్, మల్లేశ్, నాగరాజు, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్

చారకొండ, జూన్ 14 : మండలంలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టాలని ఎస్సై రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వ్యాపారస్తులకు, ప్రజలకు పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నిషేధిత మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. కిరాణం దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో గుడుంబా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ వెంకట్‌రెడ్డి, నాగయ్య, పోలీస్, ఎక్సైజ్ పీసీలు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పైకప్పు..!

- భయాందోళనలో ఉద్యోగులు

కోడేరు, జూన్ 14 : కోడేరు ఎమ్మార్సీ కార్యాలయం పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఎంఈవోతోపాటు సీఆర్‌పీలు కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతినిత్యం కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే కార్యాలయంలోని పైకప్పు కొంత కాలంగా పెచ్చులు ఊడి పడుతుండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే 20 ఏండ్ల కిందట నిర్మించ భవనం కావడంతోపాటు వర్షపునీరు కిందకు వెళ్లకుండా పైభాగంలోనే నిలిచి ఉండడంతో నీటిలో తడిసిన పైకప్పు నుంచి తరచూ పెచ్చులూడుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనానికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులైన స్పందించి ఎమ్మార్సీ కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.


ఎమ్మార్సీ కార్యాలయంలో పెచ్చులూడుతున్న పైకప్పు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

చారకొండ : పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చారకొండ, జూన్ 14: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య అందుతుందని జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. అదేవిధంగా తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం మహిపాల్‌నాయక్ ఆధ్వర్యంలో అక్షర అభ్యాసం చేశారు. అనంతరం జీహెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన భగవాన్‌రెడ్డిని ఉపాధ్యాయు లు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, కమలాకర్‌రావు, అంజయ్య, నవీన్, గౌరమ్మ, గీత, రాజేందర్ రెడ్డి, సురేందర్, పీఈటీ అంజయ్య పాల్గొన్నారు.

తాడూరులో..

తాడూరు, జూన్ 14 : మండలంలోని చర్లతిరుమలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నోట్ పుస్తకాలతోపాటు ప్రతి ఒక విద్యార్థికి రెండు జతల బట్టలను అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, విద్యార్థులు ఉన్నారు.

టార్గెట్ల ప్రకారం లోడ్‌ను పంపించాలి

- తాసీల్దార్ ఇబ్రహీం

రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న తాసీల్దార్

కల్వకుర్తిరూరల్, జూన్ 14 : రైస్ మిల్లర్లు జిల్లా అధికారులు ప్రభుత్వం సూచించిన టార్గెట్ ప్రకారం బియ్యం లోడ్‌లను ప్రభుత్వానికి పంపించాలని కల్వకుర్తి మండల తాసీల్దార్ ఇబ్రహీం రైస్ మిల్లు యజమానులకు సూచించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఆయా రైస్ మిల్లులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలను వారు పరిశీలించి మిల్లులకు సీఎంఆర్ ఎంత కేటాయించారో వాటి నుంచి ప్రభుత్వానికి ఎంత అప్పగించారో అధికారులను అడిగి తెలుసుకొని చెల్లించని ఆ నిల్వలను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని పేర్కొన్నారు. టార్గెట్ మేరకు బియ్యం లోడ్‌లను పంపించాలని లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రశాంతంగా సమావేశం

మున్సిపల్ కౌన్సిల్‌కు హాజరైన కౌన్సిలర్లు

కల్వకుర్తి, జూన్ 14 : కల్వకుర్తి మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో పలు తీర్మానాలు చదివి ఆమోదించారు. పారిశుధ్య వాహనాలకు ఇందనం కొనుగోలు, పా రిశుధ్య కార్మికులకు పారిశుధ్య మెటీరియల్ అందించుట, వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో అత్యవసర పనులు చే యుట తదితర తీర్మానాలను ఆమోదించా రు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్, జూన్ 14 : రామాపురం గ్రామ సమీపంలోని వాగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కొల్లాపూర్ పట్టణ నాయకుడు బిజ్జ వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు తాసీల్దార్ శ్రీకాంత్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని అధికారులు వెంటనే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యామిలీ సర్వేపై అవగాహన

అచ్చంపేట టౌన్, జూన్ 14 : పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఫ్యామిలీ సర్వే గ్రోత్ మానిటర్‌పై అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్ విజయమణెమ్మ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు ఫ్యామిలీ సర్వే, గ్రోత్ మానిటరింగ్‌పై రివ్యూ నిర్వహించారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేసి ఫ్యామిలీ సర్వేను ట్యాలీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో దమయంతి, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు

చారకొండ, జూన్ 14 : గ్రామాల్లో, తండాల్లో సారా తయారు చేసి విక్రయిస్తే చట్టప్రరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై వివేక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారకొండ శివారులోని దాడులు నిర్వహించి 600లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 40 కిలోల బెల్లం, 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఒక్కరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దాడులో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై అరుణ, పీసీలు సిరాజ్, మహేశ్, నార్య, పరశురాం పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఆరు అడ్మిషన్లు

అచ్చంపేట రూరల్, జూన్ 14 : మండలంలోని ఏజెన్సీ లోతట్టు ప్రాంతమైన బక్కలింగయ్యపల్లి పాఠశాలలో శుక్రవారం ఆరుగురు విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నట్లు హెచ్ఎం సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు బడుల్లో చేరిన వారికి పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు తిరుపతమ్మ, గ్రామస్తులు కేతావత్ రాముడునాయక్, అంజి, గణేశ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తిమ్మాజిపేట, జూన్ 14 : మండల కేంద్రంలో ఉపాధి పనులలో భాగంగా భూమి అభివృద్ధి పనులను ఎంపీడీవో లక్ష్మీదేవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఇంకా ఎండలు కొనసాగుతున్న దృష్ట్యా పనులకు ఉదయమే రావాలన్నారు. కొలతల ప్రకారం పనులు నిర్వహించాలని, కూలీల ఎక్కువ మంది పనులకు హాజరుకావాలని కోరారు. ఆమె వెంట ఈజీఎస్ అధికారులు ఉన్నారు.

అడ్డంకులు తొలగడంతో భాషాపండితుల హర్షం

నాగర్‌కర్నూల్, జూన్ 14 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాషా పండితులు, పీఈటీల పదోన్నతులకు పూర్తిస్థాయిలో అడ్డంకులు తొలగిపోవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాషా పండితుల 20 ఏండ్ల కల సహకారానికి సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. ఈ మేరకు సుప్రీం కోర్టు ఎదుట వారు హర్షం ప్రకటించారు. సుప్రీంకోర్టులో ఎస్జీటీలు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పండితులు, పీఈటీలకు అనుకూలంగా ఇచ్చిన డివిజన్ బెంచ్ తీర్పును సమర్థిస్తూ ఎస్జీటీల పిటిషన్‌ను డిస్మిస్ చేసిందని రాష్ట్ర ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెద్దకొత్తపల్లి, జూన్ 14 : మండలంలోని గంట్రావుపల్లి గ్రామంలో సొసైటి ఫర్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కుటుంబం ప్రభుత్వాలు కల్పించే ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆ సంస్థ ఆర్గనైజర్ మన్సూర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

అచ్చంపేట టౌన్, జూన్ 14 : పట్టణానికి చెందిన యూపీహెచ్ఎస్‌లో 1989-90 బ్యాచ్ విద్యార్థులు పట్టణంలోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు పలకరించుకొని వారి స్థితిగతులను తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరు ఆడిపాడి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో గురువులు సరస్వతి, సుచరిత, పద్మావతి, వసంత, కమలమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ SIFEL MINERALS PVT. LTD.
Vacancies at Thirumalaiahpally (V), Bhoothpur, Telangana.
1.Industrial Electrician for Minor Factory Repairs, 2. Accountant for GST Billing, Sales Record maintenance and reporting.
Ph: 9118126666.
NT-333883

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794